

సరిహద్దున 'మహా శివరాత్రి'

జిల్లాతోపాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సరిహద్దున ఉన్న మహారాష్ట్రలోని ఆలయాలు మహాశివరాత్రికి ముస్తాబయ్యాయి. ఈ ఆలయాలకు స్థానికులు భారీగా తరలి వెళ్లనున్నారు. 8లో▸



జనావాసాల్లో డంప్

ఇళ్ల మధ్యలోనే ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులో చెత్త గుట్టలుగా పేరుకుపోతోంది. నిప్పంటిస్తుండడంతో స్థానికులు దుర్వాసన, పొగతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. 9లో▸

గరిష్టం/కనిష్టం
37.0 /24.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉత్తరం దిశగా గాలులు వీస్తాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గే అవకాశం ఉంది.

గులాబీ గూటికి పగుళ్లు!

- బీఎస్పీ, బీఆర్‌ఎస్ పొత్తుతో కాంగ్రెస్‌లోకి కోనప్ప
- ఇప్పటికే 'హస్తం' పార్టీలోకి పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత
- మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు పార్టీ మార్పుపై చర్చలు
- బీఆర్‌ఎస్ నేతలే లక్ష్యంగా కాంగ్రెస్, బీజేపీ పావులు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: లోక్‌సభ ఎన్నికల ముందు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. బీఆర్‌ఎస్‌తో బీఎస్పీ పొత్తు ఖరారు కావడంతో సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు కోనేరు కోనప్ప, ఆయన సోదరుడు జెడ్పీ చైర్‌పర్సన్ కోనేరు కృష్ణారావుతోపాటు అనుచర వర్గం కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం కలిశారు. దీంతో పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఈ నియోజకవర్గంలో మరింత దెబ్బ తగలనుంది. తాజా పరిణామాలతో ఉమ్మడి జిల్లాలో మరికొందరు నాయకులు కండువాలు మార్చుతారనే ప్రచారం జోరందుకుంది. ప్రధానంగా బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులే లక్ష్యంగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పావులు కదుపుతుండడంతో ఎవరు ఎటువైపు వెళ్తున్నారనేది ఆసక్తికరంగా మారింది. అటు ఆదిలాబాద్ ఇటు పెద్దపల్లి పార్లమెంటు స్థానాల్లో నాయకుల తీరు రాజకీయ మార్పులకు దారి తీస్తున్నాయి.

మాజీ ఎమ్మెల్యేల పక్క చూపులు

బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కొందరు మాజీ ఎమ్మెల్యేలు పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాభవంతో నేతల్లో నైరాశ్యం నెలకొంది. తమ రాజకీయ భవిష్యత్ కోసం పార్టీ మారేందుకు అంతర్గతంగా చర్చలు సాగుతున్నాయి. కాంగ్రెస్‌లోకి వెళ్లడమా..? బీజేపీలో చేరడమా..? అనే దానిపై తర్జనభర్జనలు పడుతున్నారు. ప్రస్తుతం 'గులాబీ' పార్టీకి గడ్డు కాలమే ఉండడంతో కార్యకర్తలు, నాయకుల నుంచి ఒత్తిడి కారణంగా మార్పు తథ్యంగా భావిస్తున్నారు. ఇందుకు లోక్‌సభ ఎన్నికలు మంచి తరుణంగా భావిస్తూ ఎవరికి ఏ పార్టీతో మేలు ఉంటుందో లెక్కలు వేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ టచ్‌లోకి వెళ్లినట్లు సమాచారం. వచ్చే ఎన్నికల్లో తమకు ప్రాధాన్యత ఇస్తేనే చేరుతామనే మెలిక పెట్టినట్లుగా చెబుతున్నారు. అయితే ఎవరికీ స్పష్టమైన హామీ రానట్లు తెలిసింది. వీరితోపాటు మరో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు బీజేపీ నాయకులతో చర్చలు జరిపారు. తమ పార్టీలోకి రావాలని ఆహ్వానాలు అందడంతో పార్టీ మార్పుపై నిర్ణయం తీసుకోవడంపై ఆలోచిస్తున్నారు. ఓ మాజీ ఎమ్మెల్సీతోపాటు సీనియర్ నాయకులు సైతం పార్టీ మార్పుపై గత కొంతకాలంగా సమాలోచనలు చేస్తున్నారు.

బయటపడనున్న అసంతృప్తులు

ఉమ్మడి జిల్లాలో రెండు ఎంపీ స్థానాల గెలుపు కోసం కాంగ్రెస్, బీజేపీ గట్టి ప్రయత్నాలే చేస్తున్నాయి. ఇందుకు ధీటైన అభ్యర్థుల కోసం అనేక రకాలుగా వడపోతలు చేస్తున్నాయి. ఆదిలాబాద్ సిట్టింగ్ సీటును ఎంపీ సోయం బాపురావుకే కట్టబెడతారా..? లేదా..? అనే సస్పెన్స్ కొనసాగుతోంది. మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్, డాక్టర్ సుమలత, జెడ్పీ చైర్‌పర్సన్ రాథోడ్ జనార్దన్, తదితరులు పోటీలో ఉన్నారు. ఆదివాసీ, లంబాడా వర్గాల ప్రభావం, ప్రత్యర్థి పార్టీల్లో అభ్యర్థుల ఖరారు కాకపోవడంతో వేచి చూస్తున్నారు. మళ్లీ 'సోయం'కు అవకాశం రాకపోతే ఆయన నిర్ణయం ఎలా ఉండబోతుందనే ఆసక్తి నెలకొంది. ఇక బీఆర్‌ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎంపీ గొడం నగేశ్ ఉన్నారు. నగేశ్ గత అసెంబ్లీ ఎన్నికల్లో బోథ్ టికెట్ ఆశించి భంగపడ్డారు. ఎమ్మెల్సీ, కార్పొరేషన్ పదవులు దక్కలేదు. దీంతో ఆయన నిర్ణయం ఎటువైపు ఉంటుందోనని ఆసక్తిగా మారింది. ఇక పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ప్రకటించగా, ఆయన ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్‌లో ఎంపీ టికెట్ ఆశించి పార్టీలో చేరిన సిట్టింగ్ ఎంపీ బొర్లకుంట వెంకటేశ్ నేత, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ తనయుడు గడ్డం వంశీకృష్ణ ప్రధానంగా పోటీలో ఉండగా, పెర్క శ్యామ్ మరికొందరు టికెట్ ఆశిస్తున్నారు. 'గడ్డం' కుటుంబానికే మళ్లీ టికెట్ ఇస్తే పార్టీకి ఇబ్బంది అవుతుందని కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో వంశీకి టికెట్ ఇస్తే నాయకుల్లో అసంతృప్తి రాజుకోనుంది. ఇక బీజేపీలో మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, దుర్గం అశోక్, కొయ్యల ఏమాజీ టికెట్ ఆశిస్తుండగా, ఎస్.కుమార్‌తోపాటు మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ వంటి నేతలు పోటీలో ఉన్నారు.

ప్రతీ దరఖాస్తు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



స్వీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాహుల్

నస్పూర్: ప్రజాపాలన ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ బీ.రాహుల్ సూచించారు. బుధవారం ఆయన మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రజాపాలన దరఖాస్తు స్వీకరణ సేవా కేంద్రాన్ని సందర్శించారు. కమిషనర్ సీహెచ్.సతీష్‌తో సమావేశమై ఇంటి పన్నుల వసూలు, ట్రేడ్ లైసెన్స్, ఇంటి అనుమతులపై తెలుసుకున్నారు. అనంతరం అదనపు కలెక్టర్ రాహుల్‌ను మున్సిపల్ చైర్మన్ సురమిల్ల వేణు మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఓ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

మహా శివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



మంచిర్యాలఅర్బన్: మేడారం జాతర వేళ అదనపు ఆదాయాన్ని సమకూర్చుకున్న ఆర్టీసీ యాజమాన్యం మహా శివరాత్రిని పురస్కరించుకుని శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు సన్నద్ధమవుతోంది. జిల్లా కేంద్రమైన మంచిర్యాల డిపో నుంచి ఆయా శైవక్షేత్రాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడిపించాలని సంస్థ యోచిస్తోంది. ఇందులో భాగంగా వేలాల మల్లన్న జాతరతోపాటు కాళేశ్వరానికి బస్సులు నడపాలని నిర్ణయించింది. ఈ నెల 7 నుంచి 9 వరకు జాతరకు బస్సులు నడిపిస్తారు. వేలాలకు రోజు రద్దీకి అనుగుణంగా బస్సులు తిప్పాలని యోచిస్తోంది. దాదాపు 10నుంచి 30 బస్సుల ద్వారా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేయనున్నారు. మంచిర్యాల నుంచి వేలాల, చెన్నూర్ నుంచి కాళేశ్వరం, వేలాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నామని మంచిర్యాల డీఎం రవీంద్రనాథ్ తెలిపారు. మంచిర్యాల–వేలాల జాతరకు పెద్దలకు రూ.70, పిల్లలకు రూ.40 చార్జీలు ఉన్నాయని పేర్కొన్నారు.

ముల్కల్లలో పుణ్యస్నానాలకు రావద్దు



ముల్కల్ల గోదావరి తీరం వద్ద అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల గోదావరి పుష్కర ఘాట్ వద్ద పుణ్యస్నానాలకు భక్తులు రావొద్దని అధికారులు ప్రకటించారు. మహాశివరాత్రి నేపథ్యంలో భక్తులు పుణ్యస్నానాలకు వచ్చే అవకాశం ఉండడంతో హాజీపూర్ ఎంపీడీవో మధుసూదన్, మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, ఎస్సై గోపతి సురేష్, ఎంపీవో శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సరిత బుధవారం గోదావరి తీర ప్రాంతాలను పరిశీలించారు. ముల్కల్ల గోదావరి తీరం అపరిశుభ్రంగా, బురదమయంగా ఉండడం, అతి తక్కువ దూరంలోనే నదిలో లోతుగా ఉన్నట్లు గుర్తించారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో 7, 8వ తేదీల్లో భక్తులు ఎవరూ ముల్కల్ల గోదావరి నది వైపు రాకుండా దారి మూసివేశారు. గోదావరి పుణ్యస్నానాలకు రావొద్దని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూసుకోవాలని అధికారులు సూచించారు.

'ఎస్సీ వర్గీకరణ బీజేపీ పతనానికి నాంది'



నియామక పత్రాలు అందజేస్తున్న రామ్మూర్తి

పాతమంచిర్యాల: ఎస్సీ వర్గీకరణ బీజేపీ పతనానికి నాంది అని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో మాల మహానాడు నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బహుజనులపై దాడులు జరిగితే స్పందించని మోదీ ఎలా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. మాల మహానాడు జిల్లా కమిటీని ఎన్నుకుని నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జూపాక సుధీర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనకం రవీందర్, సోగాల కిష్టయ్య, జాతీయ ఉపాధ్యక్షుడు మత్యమాల పుల్లయ్య, రాష్ట్ర కార్యదర్శి సుద్దాల వెంకటయ్య పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



రిటైర్డు జడ్జిని సన్మానిస్తున్న న్యాయవాదులు

మంచిర్యాలక్రైం: న్యాయవాదులు చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ పీఎస్.నారాయణ అన్నారు. బుధవారం ఆయన హైకోర్టు రిటైర్డ్ జడ్జి, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ చంద్రయ్యతో కలిసి జిల్లా కోర్టును సందర్శించారు. అనంతరం బార్ అసోసియేషన్ సమావేశ మందిరంలో న్యాయవాదులతో సమావేశం అయ్యారు. జూనియర్ న్యాయవాదులు వృత్తిలో రాణించేందుకు మెలకువలు, సలహాలు, సూచనలు ఇచ్చారు. నిరంతరం న్యాయశాస్త్రాన్ని అభ్యసించడం, చట్టాలు, సెక్షన్లు తదితర కేసుల్లో పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మంచిర్యాలలో కోర్టు భవన నిర్మాణానికి నిధుల మంజూరు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం నారాయణను అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి అర్పిత మారంరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్తయ్య, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు ఘనంగా సన్మానించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

పాతమంచిర్యాల: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని డీటీడీవో గంగారాం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సాయికుంట గిరిజన ఆశ్రమ పాఠశాలలో జిల్లాలోని క్రీడా పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాల కోసం విద్యార్థులకు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీల్లో 75 మంది బాలబాలికలు పాల్గొనగా 10మంది బాలికలు, 10 మంది బాలురు ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లాలోని జాత్రర్ల, ఉట్నూర్ బాలుర, ఆసిఫాబాద్ బాలికల క్రీడా పాఠశాలల్లో ప్రవేశం కల్పిస్తామని తెలిపారు. జిల్లా గిరిజన క్రీడల అధికారి బండ జీవరత్నం, ప్రత్యేక అధికారి మడావి శంకర్, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి గృహజ్యోతి

- జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

బెల్లంపల్లిరూరల్: అర్హులైన ప్రతీ ఒక్క లబ్ధిదారునికి గృహజ్యోతి పథకం అమలు చేస్తామని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీలో అర్హులకు జీరో బిల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకోని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ శేషారావు, ఎస్ఏవో శ్రీనివాస్, డీఈ రాజన్న, టెక్నికల్ ఏడీఈ తిరుపతి, ఏడీఈ శ్రీనివాస్, ఏఈలు రాంమనోహర్, శ్రీనివాస్, జేపీఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తులు పరిష్కరించాలి

పాతమంచిర్యాల: ధరణి పోర్టల్ ద్వారా చేసుకున్న దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్ సంతోష్ అన్నారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తప్పిపోయిన సర్వేనంబర్లు పరిశీలించాలని, వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. పలు మండలాల్లో భూ సమస్యలపై వచ్చిన ధరణి దరఖాస్తుల వివరాలు పరిశీలించి పరిష్కరించిన వివరాలు వెల్లడించారు.



రైతువేదికలో వీక్షిస్తున్న కలెక్టర్, అధికారులు

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

పాతమంచిర్యాల: వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, మిషన్ భగీరథ ఈఈ వెంకటేష్‌తో కలిసి తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు, ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలతో తాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టి జిల్లాలోని బోర్‌వెల్స్, పంప్‌సెట్‌లు, లీకేజీ పైప్‌లైన్‌లు, వాటర్‌ట్యాంక్‌లలో ఏర్పడిన సమస్యలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని తెలిపారు.

రైతు నేస్తంతో అనేక లాభాలు

బెల్లంపల్లిరూరల్: రైతునేస్తంతో రైతులకు అనేక లాభాలు చేకూరుతాయని కలెక్టర్ సంతోష్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి డివిజన్ పరిధి కన్నాల రైతు వేదికలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించిన రైతునేస్తంలో వీడియో కాన్ఫరెన్స్ తిలకించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు సాగులో మెలకువలు, సేంద్రియ సాగుపై అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. మండల ప్రత్యేక అధికారి సీహెచ్.దుర్గాప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కల్పన, ఎంపీపీ శ్రీనివాస్, తహసీల్దార్ కేవై.ప్రసాద్, ఏడీఏ సురేఖ, కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ శివకృష్ణ, బెల్లంపల్లి, ఎంపీడీవో మహేందర్ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై బీఆర్‌ఎస్ నిరసన



మంచిర్యాలలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

పాతమంచిర్యాల: ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మంచిర్యాల ఐబీ చౌరస్తాలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా అమలు చేస్తామని ఆనాడు రేవంత్‌రెడ్డి ప్రకటించారని, ప్రస్తుతం డబ్బుల వసూలు సిద్ధమయ్యారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, మున్సిపాలిటీ ఫ్లోర్‌లీడర్ అంకం నరేష్, కౌన్సిలర్లు, విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలపై భారం

చెన్నూర్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే ప్రజలపై రూ.20 వేల కోట్ల భారం మోపేలా ఎల్‌ఆర్‌ఎస్ కార్యక్రమాన్ని వేగవంతం చేస్తోందని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిరసనగా స్థానిక పాత తహసీల్ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం మున్సిపల్ కమిషనర్ గంగాధర్‌కు అందజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి బోడ జనార్దన్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లెల దామోదర్‌రెడ్డి, ఎంపీపీ మంత్రి బాపు, నాయకులు సాధనబోయిన కృష్ణ, విద్యాసాగర్, బైంస ప్రభాకర్, కర్నె సమ్మయ్య, ఆసంపల్లి సమ్మయ్య, నాయిని సతీశ్, సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు భద్రమేనా..?

- ఆసిఫాబాద్ డిపోకు చెందిన అద్దె బస్సు వెనుక కుడివైపు టైర్లు ఊడి బయటకు వచ్చాయి. తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. హబ్బు లోపల గ్రీసు మొత్తం మాడిపోయి ఈ సంఘటన జరిగినట్లు గుర్తించారు.
- ఇటీవల మంచిర్యాల డిపో నుంచి కామారెడ్డి బస్సు సమ్మక్క–సారక్క జాతరకు 49మందితో బయల్దేరింది. బస్సు, లారీ ఢీకొన్న సంఘటనలో 20మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు, కండక్టర్లకు తీవ్ర గాయాలయ్యాయి.



బస్సు చక్రాలు ఊడిపోయిన దృశ్యం(ఫైల్)

- కాలం చెల్లిన వాటిలోనే ప్రయాణం
- కొత్తవి రావు.. బాధలు తీరవు
- పెరిగిన ప్రయాణికుల రద్దీ

మంచిర్యాలఅర్బన్: 'ప్రయాణికుల సేవే మా లక్ష్యం.. సురక్షితంగా గమ్యస్థానం చేర్చడం మా కర్తవ్యం.. ప్రయాణికుల సౌకర్యార్థం అనేక వసతులు కల్పించాం..' అంటూ ప్రచారం చేసుకుంటున్న ఆర్టీసీ యాజమాన్యం బస్సుల స్థితిగతులపై నిర్లక్ష్యం వహిస్తోంది. ఏళ్ల తరబడి కొత్త బస్సుల సంఖ్య పెరగకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో ప్రజలకు రవాణా సదుపాయం దూరమవుతోంది. కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నామని చెబుతున్నా వాటి సంఖ్య పరిమితంగానే ఉంటోంది. మహాలక్ష్మి పథకం అమలుతో బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగింది. కొత్త బస్సులు రాకపోగా డొక్కు బస్సులతోనే నెట్టుకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. పరిమితికి మించి ప్రయాణికుల తరలింపుతో బస్సులు అదుపుతప్పిన సంఘటనలు లేకపోలేదు. ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైన సందర్భంలో ఎంతోమంది క్షతగాత్రులుగా మారుతున్నారు. వీరికి ప్రథమ చికిత్స చేయడానికి బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, మందులు అందుబాటులో లేని దుస్థితి నెలకొంది.



బస్సులోపల స్టీరింగ్ డ్యాష్ బోర్డు పరిస్థితి ఇదీ



అలంకార ప్రాయంగా ఫస్ట్ ఎయిడ్ బాక్సు

డిపోలో ఇలా..

మంచిర్యాల డిపోలో 150 బస్సులు ఉన్నాయి. 81 సంస్థ బస్సులు కాగా, 69 అద్దె బస్సులు నడుస్తున్నాయి. సంస్థ బస్సుల్లో లహరి ఏసీ, నాన్ ఏసీ 8, రాజధాని 3, సూపర్ లగ్జరీ 24, ఎక్స్‌ప్రెస్ 7, డీలక్స్ 1, పల్లెవెలుగు 38 ఉన్నాయి. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ అవకాశం కల్పించారు. దీంతో బస్సుల్లో రద్దీ ఎక్కువగా ఉంటోంది. 59 మంది ఎక్కాల్సిన బస్సుల్లో 120 మంది ప్రయాణిస్తున్న సందర్భాలు ఉన్నాయి. పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కడంతో వాహనాల నియంత్రణ లేకుండా పోతోందని డ్రైవర్లు వాపోతున్నారు. దాదాపుగా 20కి పైగా పాత బస్సులు ఉన్నట్లు తెలుస్తోంది.

పర్యవేక్షణ..

సాధారణంగా బస్సులు డిపో నుంచి బయల్దేరే సమయంలో మెకానికల్ ఇంజినీర్ పరిశీలించి లోపాలు ఉంటే మరమ్మతులు చేసి పంపిస్తారు. కొత్త బస్సుల్లో అన్నీ బాగానే ఉన్నా.. కొన్ని పాత బస్సుల్లో సైడ్‌మిర్రర్ నుంచి బస్సు లోపల ఉండే డ్యాష్‌బోర్డులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఏళ్ల తరబడి స్పేర్‌పార్ట్స్ రాకపోవడంతో ఉన్న వాటితోనే సర్దుకుపోతున్నారు. డ్యాష్‌బోర్డులో ఇంజిన్ రెండు ఎయిర్ మీటర్లు, స్పీడో మీటరు, హీట్ మీటరు, ఫ్యూయల్‌మీటర్ ఉంటాయి. పాతకాలపు బస్సుల్లో చాలావరకు ఇవేవీ కనిపించవు. ఎయిర్ మీటరు సక్రమంగా ఉంటేనే వాహనం కదలడం నుంచి బ్రేక్‌లు వేసే వరకు అన్నీ ఉంటాయి. ఇలాంటి అత్యవసరమైన మీటరు పరికరాలు లేకుండా బస్సులు నడపాల్సిన పరిస్థితి. ఏది ఎంత ఉందో తెలుసుకోకుండా అంచనా ప్రకారం బస్సులు నడిపిస్తున్నారు. వేగం నియంత్రణపై అదుపు తప్పుతోంది. ఎండాకాలం కావడంతో కొత్త టైర్లు ఉండాలి. రహదారి వేడికి మామూలు టైర్లు పగిలిపోయి అదుపుతప్పే అవకాశాలున్నాయి. సైడ్‌మిర్రర్‌లు ఉంటాయి కానీ వెనుకాల వచ్చే వాహనాలు అద్దాలు మసకగా ఉండడం వల్ల ఏమీ కనిపించని పరిస్థితి. ఇలా మారుమూల ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో ఎక్కువ. ఇటీవల మహాలక్ష్మి పథకంతో ప్రయాణికుల రద్దీ పెరగడం, పరిమితికి మించి ప్రయాణికులను చేరవేయడం డ్రైవర్లకు కష్టతరంగా మారుతోంది.

మందులు లేని పెట్టెలు

వాస్తవానికి చాలా బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టెలు అమర్చారు. అందులో ఏ పెట్టెలోనూ కనీసం దూది, టించర్ కూడా లేదు. కొన్ని బస్సుల్లో ఫస్ట్ బాక్సులు అలంకార ప్రాయంగా మారగా.. మరికొన్ని బస్సుల్లో బాక్సులే లేవు. 2006 నుంచి 2022 వరకు వివిధ ఘటనల్లో 551 బస్సులు డ్యామేజీ కాగా 64 మంది మృతిచెందారు. 63 మంది ప్రయాణికులు బస్సు ప్రమాదాల్లో గాయాలతో బయటపడ్డారు. వీరిలో ఏ ఒక్కరికి మందుల పెట్టె (ఫస్ట్ ఎయిడ్ బాక్స్)ల ఉపయోగం లేకుండా పోయింది.

కొత్త బస్సులు వస్తేనే..

వనజాతర వేళ ఆర్టీసీ రీజియన్‌లో మంచిర్యాల డిపో ఆదాయార్జనలో ముందు వరుసలో ఉంది. కానీ కొత్త బస్సుల కేటాయింపులో మాత్రం శీతకన్నే. కాలం చెల్లిన బస్సులతో అధికారులు నెట్టుకొస్తున్నారు. ప్రయాణికుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని కొత్త బస్సుల కేటాయింపుతోపాటు సిబ్బంది నియామకం చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రమాదాలు జరిగితే..

కునుకు తీసే తీరిక లేకుండా డ్రైవర్లు డబుల్ డ్యూటీలు చేసినా శ్రమకు తగిన ఫలితం లేకుండా పోతోంది. నిద్రను లెక్క చేయకుండా విధులు నిర్వర్తించి అనారోగ్యానికి గురవుతున్నారు. నిద్రమత్తులో ప్రమాదాలు చేస్తున్న వారూ లేకపోలేదు. డబుల్ డ్యూటీల సమయంలో డ్రైవర్ జాగ్రత్తగా వెళ్లొస్తే ఫర్వాలేదు. ఏదైనా ప్రమాదం జరిగితే కింది స్థాయి ఉద్యోగులపై చర్యలు తీసుకుంటారు. నిబంధనల ప్రకారం 55 సంవత్సరాలు దాటిన డ్రైవర్లను సుదూర ప్రాంతాలకు పంపరాదు. బస్సు నడిపే ప్రతీ డ్రైవర్‌కు గంట తర్వాత 15 నిమిషాలు విశ్రాంతి ఇవ్వాలి. ఇలా ఎన్ని గంటలు బస్సు నడిపితే అన్ని 15 నిమిషాలు గమ్యం చేరాక విశ్రాంతి ఉండాలని చట్టం చెబుతోంది. ఆర్టీసీ అధికారులు, ప్రైవేటు ఆపరేటర్లు ఆ చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. కనీసం సమయం, విశ్రాంతి ఇవ్వడం లేదు. 8గంటల డ్యూటీ చేయాల్సిన కార్మికులు 14 గంటలు విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి. డ్యూటీ చేసుకుని వచ్చిన వెంటనే మళ్లీ విధులకు వెళ్తున్న సందర్భాలు అనేకం. దీంతో నిద్రలేమి, ఒత్తిడిలకు గురవుతూ అనారోగ్యం పాలవుతున్నారు.

త్వరలోనే కొత్త బస్సులు వస్తాయి

పాత బస్సుల్లో స్పీడో మీటర్లు లేనిది వాస్తవమే. హీట్ మీటర్లతోపాటు అన్ని బస్సులు కండీషన్‌లో ఉన్నాయి. బస్సుల భద్రతలో అపోహలు వద్దు. పాత బస్సుల స్థానంలో త్వరలోనే కొత్త బస్సులు రానున్నాయి. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపిస్తున్నాం. బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు, మందుల ఏర్పాట్లపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– డీఎం రవీంద్రనాథ్, మంచిర్యాల

క్లుప్తంగా

మేకల మందపై తోడేళ్ల దాడి



గాయపడిన మేక పిల్లతో కాపరి చందు

వేమనపల్లి: పట్టపగలే పంట చేలల్లో మేకలు మేత మేస్తుండగా తోడేళ్లు దాడికి పాల్పడ్డాయి. వేమనపల్లికి చెందిన కోట మల్లక్కకు చెందిన మేకల మందతో ఆమె అల్లుడు చందు పంట చేలవైపు మేత కోసం వెళ్లాడు. నాలుగు తోడేళ్లు మందపై చేయగా రెండు మేకపిల్లలకు తీవ్ర గాయాలయ్యాయి. కాపరులు అప్రమత్తమై అరవడంతో తోడేళ్లు పారిపోయాయి.

బెల్లంపల్లిలో రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యం, నిందితుడితో పోలీసులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. అంబేద్కర్‌నగర్ బస్తీలోని ఓ ఇంట్లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసి ఉంచారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తిరుపతి, శ్రీను, శ్రీధర్ తనిఖీ చేశారు. 12క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడగా, బస్తీకి చెందిన అవని గంటి సాంబమూర్తి నిల్వ ఉంచినట్లు గుర్తించారు. బియ్యం స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యం వద్ద సిబ్బంది

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధి సత్యసాయినగర్ కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పట్టుకున్నారు. ఎస్సై చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన కిషన్ అక్రమంగా సమీపంలోని షెడ్డులో సుమారు 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వ చేశాడు. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది మంగళవారం రాత్రి దాడి చేసి బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు. దాడిలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ప్రసాద్, రాకేష్, రాజు పాల్గొన్నారు.

జన్నారంలో బియ్యం పట్టివేత

జన్నారం: మండల కేంద్రంలో ఆటోలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆటోలో బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆటోలో మూడు క్వింటాళ్ల బియ్యం ఉండడంతో సీజ్ చేశారు. ఆటోలోని జరుపుల కాంతయ్యను విచారించగా, రూ.16కు కిలో చొప్పున కొనుగోలు చేసి జన్నారంలోని ఓ వ్యక్తికి రూ.18 చొప్పున విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపాడు. బియ్యం, ఆటో సీజ్ చేసి విచారణ చేస్తున్నారు.



మార్కండ దేవాలయం

సరిహద్దున 'మహాశివరాత్రి'

- ఉమ్మడి జిల్లాకు సమీపంలో ప్రసిద్ధ ఆలయాలు
- ఉత్సవాలు అట్టహాసంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు
- ప్రసిద్ధ శైవక్షేత్రంగా మార్కండ మహాదేవ ఆలయం
- ఆకట్టుకునే చపరాడ ఆలయం.. ప్రకృతి ఒడిలో 'సోమ్‌నాథ్'
- చెట్టు కాండంలో విగ్రహాల జాతర.. తోగుల వెంకటాపూర్

చింతలమానెపల్లి(సిర్పూర్): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా భిన్న సంస్కృతి, సంప్రదాయాలకు నిలయం. ఏడాది పొడవునా ఆధ్యాత్మిక చింతనలో గడిపే ఇక్కడి గిరిజనులు, గిరిజనేతరులు పలు ఉత్సవాలు జరుపుకొంటారు. ఉమ్మడి జిల్లాతోపాటు సరిహద్దులో ఉన్న మహారాష్ట్రలోని ప్రసిద్ధ ఆలయాలను సైతం సందర్శిస్తుంటారు. మహాశివరాత్రి వేళ అక్కడి ప్రముఖ శైవక్షేత్రాలు ఉత్సవాలకు సిద్ధమయ్యాయి. ప్రకృతి ఒడిలో వెలసిన ఈ ఆలయాలకు స్థానికులు భారీగా తరలివెళ్లనున్నారు.

మార్కండ మహాదేవ ఆలయం

మహారాష్ట్రలోని ప్రసిద్ధ శైవక్షేత్రాల్లో మార్కండ మహాదేవ ఆలయం ఒకటి. భక్త మార్కండేయుడు కొలిచిన శైవక్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. గడ్చిరోలి జిల్లాలోని చాముర్షి తాలూకాలో ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్న వైన్‌గంగ నది తీరంలో ఈ ఆలయం ఉంది. అద్భుతమైన ప్రాచీన కట్టడమైన ఇక్కడ జరిగే మహాశివరాత్రికి లక్షల్లో భక్తులు తరలివస్తారు. పురాణాల ప్రకారం.. హర్యానా ప్రాంతానికి చెందిన మార్కండేయ అనే రుషి శివుడి అనుగ్రహం కోసం ప్రత్యక్షం కావడానికి ఘోర తపస్సు చేస్తాడు. అతడి తపస్సును అడ్డుకునే ప్రయత్నం చేయడంతో రుషి శిరస్సును ఖండించి శివుడికి సమర్పించే ప్రయత్నం చేస్తాడు. దీంతో అతడిని శివుడు అనుగ్రహిస్తాడు. ఈ ప్రాంతం రుషి పేరుమీదుగా ప్రసిద్ధి చెందుతుందని వరమిస్తాడు. ఆలయాన్ని 8వ శతాబ్దం నుంచి 12వ శతాబ్దం మధ్య రాష్ట్రకూటుల పాలనలో అభివృద్ధి చేసినట్లు శాసనాలు తెలియజేస్తున్నాయి. దాదాపు 15 రోజులపాటు శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తారు. తాత్కాలికంగా సినిమా థియేటర్లు, సర్కస్, మ్యాజిక్‌షోలు ఏర్పాటు చేస్తున్నారు. కుమురంభీం జిల్లా సిర్పూర్(టి) నుంచి 80 కిలోమీటర్ల దూరం, కాగజ్‌నగర్ నుంచి 105 కిలోమీటర్ల దూరంలో ఈ పురాతన ఆలయం ఉంది. సమీపంలోని చాముర్షి, మూల్ పట్టణాల నుంచి బస్సు సౌకర్యం ఉంది. అలాగే చంద్రపూర్, మూల్ పట్టణాల్లో రైల్వేస్టేషన్లు ఉన్నాయి.

బెజ్జూర్‌లో అనంత పద్మనాభుడు



శేషపాన్పుపై స్వామివారు

బెజ్జూర్(సిర్పూర్): మహాశివరాత్రికి బెజ్జూర్ మండల కేంద్రంలోని అతిపురాతన రంగనాయక ఆలయం ముస్తాబైంది. శివరాత్రి సందర్భంగా ఉత్సవాలు ఘనంగా జరుపుకోవడం అనాదిగా వస్తోంది. 18వ శతాబ్దంలో కాకతీయ రాజుల నాటి కాలంలో బిజ్జా అనే గోండు రాజు సామంత రాజుగా పాలించేవాడు. బిజ్జా హయాంలోనే బెజ్జూర్‌లో రంగనాయక దేవాలయ నిర్మాణం జరిగినట్లు స్థానికులు చెబుతుంటారు. ఆలయంలో రంగనాయకుడి(అనంత పద్మనాభుడు) విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మొదటిరోజు భక్తులు ప్రాణహిత నదిలో స్నానాలు ఆచరించి దైవ దర్శనం చేసుకుంటారు. జాగారాలు చేసి, ఉపవాస దీక్షలు చేపడతారు.

కత్తెరసాల మల్లన్న.. ఘన చరిత్ర

- భ్రమరాంభ, మల్లిఖార్జున స్వామి కల్యాణం
- మూడు రోజులపాటు జాతర

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాల మల్లిఖార్జున స్వామి ఆలయానికి ఎంతో ప్రాశస్త్యం ఉంది. అగస్త్య మహాముని ఇక్కడ శివపార్వతులకు పూజలు చేసే వారని స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. ఇక్కడ వెలిసిన మల్లిఖార్జున స్వామి, భ్రమరాంభికల విగ్రహాలకు కాకతీయుల పాలన కాలంలోనే ఆలయం నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. ఆలయాన్ని 450 ఏళ్ల క్రితం పునర్నిర్మించారు. అగస్త్య మహాముని నారాయణపూర్ గ్రామ సమీపంలోని కోటిలింగాల గోదావరి నదిలో స్నానమాచరించి సొరంగ మార్గం ద్వారా కత్తెరసాల మల్లిఖార్జున స్వామి ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించేవారని స్థల పురాణం చెబుతోంది. ప్రతియేటా మహా శివరాత్రి పర్వదినాన శివపార్వతుల కల్యాణం, నాగవెల్లి జరిపి మూడు రోజులపాటు జాతర నిర్వహిస్తారు. ఈ గ్రామంలో యాదవులే ఎక్కువ.. వీరు మల్లిఖార్జున స్వామిని ఆరాధ్య దైవంగా భావించి నిత్య పూజలు చేస్తుంటారు. కన్నెపల్లి గ్రామానికి చెందిన యాదవ కులస్తుడైన కాటవేన గోపాల్ వంశీయులు 450 ఏళ్లుగా ఇక్కడ పూజలు నిర్వహించారు. గోపాల్ తదనంతరం అతని కుమారుడు ఓదేలు, కుమార్తె పోసక్క, మనుమలు ఇక్కడ పూజలు నిర్వహిస్తూ స్వామి వారి సేవలో తరిస్తున్నారు. ఒగ్గు పూజారులు ఒగ్గు కథలు, పట్నాలతో మల్లన్న స్వామికి భోనాలు సమర్పిస్తారు. మహా శివరాత్రి పండుగను పురస్కరించుకుని శుక్రవారం శివపార్వతుల కల్యాణ మహోత్సవం అధికారికంగా నిర్వహించనున్నట్లు దేవాదాయశాఖ అధికారులు తెలిపారు. కల్యాణ మహోత్సవానికి, 8నుంచి 10వరకు నిర్వహించే జాతరకు ఏర్పాట్లు చేశారు.



ఆలయ ముఖద్వారం

సోమ్‌నాథ్ ప్రకల్ప్



సోమ్‌నాథ్ శివాలయం

ప్రకృతి ఒడిలో వెలిసిన శివాలయం చంద్రపూర్‌లోని మూల్ పట్టణం సమీపంలోని సోమ్‌నాథ్ వద్ద ఉంది. శివుడి పేరు మీదుగా ఈ ప్రాంతాన్ని సోమనాథ్‌గా పిలుస్తారు. సహ్యాద్రి కనుమలు ఇక్కడి నుంచే ప్రారంభమైనట్లుగా భౌగోళిక గుర్తింపు ఉంది. బాబా ఆమ్టె ఆధ్వర్యంలో ఇక్కడ ఏర్పాటైన ఆనంద్‌వన్ ఆకర్షనీయంగా ఉంటుంది. శివరాత్రి ఘనంగా నిర్వహిస్తారు. ఆలయం చుట్టూ భారీ వృక్షాలు, పక్కనే జలపాతంతో ఈ ప్రాంతం ప్రకృతి ప్రేమికులను సైతం ఆకట్టుకుంటుంది. ఇక్కడికి సమీపంలో మూల్ పట్టణం ఉంటుంది. కాగజ్‌నగర్ నుంచి 80కిలోమీటర్ల దూరంలో ఉంది. సిర్పూర్(టి) నుంచి మహారాష్ట్రలోని గోండ్ పిప్రి మీదుగా రోడ్డుమార్గం ద్వారా చేరుకోవచ్చు.

చపరాడ ప్రశాంతధామ్



చపరాడ ప్రశాంతధాం

సంత్‌శ్రీ కార్తీక్ మహరాజ్ ప్రతిష్ఠించిన ప్రశాంతధాం ఆలయాల సముదాయం చపరాడ. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా ఆష్టి సమీపంలోని చపరాడ గ్రామం పేరుతో ఈ ప్రాంతం ఉంది. ఇక్కడ హనుమాన్, శివాలయం, దుర్గాదేవి, శ్రీరాముడు, సాయిబాబా, గజానన్ మహరాజ్ ఆలయాలను కార్తీక్ మహరాజ్ ఆధ్వర్యంలో నిర్మించారు. ఏటా శివరాత్రికి ఐదు రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. దట్టమైన అటవీ ప్రాంతంలో ప్రాణహిత నది జన్మస్థలంలో కొలువైన ఈ ఆధ్యాత్మిక క్షేత్రానికి భక్తులు భారీగా తరలివస్తారు. మహారాష్ట్ర, తెలంగాణ సంస్కృతులతో పూజలు నిర్వహిస్తారు. మహారాష్ట్ర ప్రభుత్వం చపరాడకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తుంది. కాగజ్‌నగర్ నుంచి సిర్పూర్(టి) మండల కేంద్రం మీదుగా.. చింతలమానెపల్లి నుంచి అహేరి మీదుగా రోడ్డు మార్గాలు ఉన్నాయి. కాగజ్‌నగర్ నుంచి సుమారు వంద కిలోమీటర్ల దూరంలో ఉంది.

తోగుల వెంకటాపూర్



తోగుల వెంకటాపూర్‌లో విగ్రహాలు

ప్రాణహిత నది తీరంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో తోగుల వెంకటాపూర్ ఒకటి. ఇక్కడ చెట్టు కాండంలో దేవతలు వెలిసినట్లుగా భక్తులు భావిస్తారు. సుమారు 800 ఏళ్ల క్రితం స్థానికులకు వేంకటేశ్వర స్వామి కలలోకి వచ్చి చెట్టు కాండంలో ఉన్నట్లు తెలిపాడని.. ఇక్కడి రాజు చెట్టు కాండంలోని దేవుడిని గుర్తించాడని భక్తుల విశ్వాసం. ఇప్పటికీ చెట్టు కాండంలోనే విగ్రహాలను ఉంచి కొలుస్తారు. వేంకటేశ్వర స్వామితోపాటు శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నారు. మూడు రోజులపాటు నిర్వహించే శివరాత్రి ఉత్సవాలలో భక్తులు పెద్దఎత్తున పాల్గొంటారు. భగవంతుడి మహిమలతో వెలిశాయని విశ్వసించే నీటి ఊటలు, వందల ఏళ్ల నాటి అటవీ సంపద భక్తులకు కనువిందు చేస్తాయి. గడ్చిరోలి జిల్లాలోని ఈ ప్రాంతానికి రోడ్డు మార్గం ద్వారా చేరుకోవచ్చు. కాగజ్‌నగర్ నుంచి చింతలమానెపల్లి మీదుగా గడ్చిరోలి జిల్లా అహేరికి.. అక్కడి నుంచి నేరుగా తోగుల వెంకటాపూర్‌కు రహదారి సౌకర్యం ఉంది. కాగజ్‌నగర్ నుంచి 110 కి.మీ. దూరంలో ఉంది.

బంగారం బ్యాగు అప్పగించిన కండక్టర్



నగలు అప్పగిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

మంచిర్యాలఅర్బన్: బస్సు ఎక్కి దిగే హడావుడిలో బంగారం బ్యాగు పోగొట్టుకున్న ప్రయాణికులకు కండక్టర్ ముత్తన్న తిరిగి అప్పగించి నిజాయతీని చాటుకున్నాడు. మంగళవారం బెల్లంపల్లికి చెందిన మేకల రమేష్ కుటుంబ సభ్యులతో మంచిర్యాల నుంచి దహెగాంకు వెళ్లే ఆర్టీసీ బస్సుల్లో ఎక్కారు. ప్రయాణికులు రద్దీగా ఉండడంతో వెంట తీసుకెళ్లిన ఐదు తులాల బంగారం బ్యాగు బస్సులోనే మరిచిపోయి దిగిపోయారు. కొద్దిసేపటి తర్వాత బస్సు కనిపించకపోవడంతో ఆందోళన చెందారు. బెల్లంపల్లికి వెళ్లే సరికి బస్సులో ఓ బ్యాగు కండక్టర్ ముత్తన్న కంటపడింది. దీంతో డ్రైవర్ రాజంతో కలిసి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే బస్టాండ్‌లో బ్యాగుకు సంబంధించిన ప్రయాణికులు సంప్రదించడంతో డీఎం రవీంద్రనాథ్ ఆధారాలు చూసి బంగారం బ్యాగు ఇవ్వాలని సూచించారు. దీంతో ఆర్టీసీ ఉద్యోగులు మేకల రమేష్‌కు అప్పగించారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య



సీతారాం మృతదేహం

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని గోలేటికి చెందిన బానోత్ సీతారాం(63) అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సీతారాం కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకున్నా ఆరోగ్యం కుదుటపడలేదు. తీవ్ర మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. గమనించిన అతడి కుమార్తె కేకలు వేసింది. హుటాహుటిన వచ్చిన కుటుంబ సభ్యులు సీతారాంను ఆసిఫాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సీతారాం మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి ఐదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు బానోత్ రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కత్తితో గాయపర్చిన వ్యక్తికి జైలు

మంచిర్యాలక్రైం: కత్తితో పొడిచి గాయపరిచిన వ్యక్తికి నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ స్థానిక అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి అర్పిత మారంరెడ్డి బుధవారం తీర్పునిచ్చారు. స్థానిక పట్టణ సీఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. 2023 జూలై 25న సున్నంబట్టివాడకు చెందిన మార్త సదిరాజు, అదే వాడకు చెందిన మహ్మద్ చాంద్‌పాషా మధ్య గొడవ జరిగింది. చాంద్‌పాష కత్తితో సదిరాజును మెడ, ఎడమ భుజంపై గాయపర్చాడు. సదిరాజు తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదైంది. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మదన్‌మోహన్, కోర్టు కానిస్టేబుల్ రాజన్న, లైజన్ ఆఫీసర్లు గులామ్ దస్తగిర్, మరియం రాజు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. చాంద్‌పాషాపై నేరం రుజు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధించారు.

సీఎంపీఎఫ్ సెటిల్‌మెంట్లపై శిక్షణ



మాట్లాడుతున్న అధికారులు

శ్రీరాంపూర్: సింగరేణి ఉద్యోగులకు సంబంధించి కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్(సీఎంపీఎఫ్) కేసుల సెటిల్‌మెంట్లపై ఆ శాఖ అధికారులు కంపెనీ అధికారులకు శిక్షణ ఇచ్చారు. బుధవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్సు హాల్‌లో ఏరియా ఇంచార్జి జీఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సీఎంపీఎఫ్ గోదావరిఖని రీజియన్ కమిషనర్ హరి పచౌరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సీఎంపీఎఫ్ ఎలా సబ్మిట్ చేయాలో వివరించారు. సెటిల్‌మెంట్లు త్వరగా జరగాలంటే ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓ టు జీఎం పురుషోత్తంరెడ్డి, డీజీఎం(పర్సనల్) పీ.అరవిందరావు, పర్సనల్ డిపార్టుమెంట్ అధికారులు పాల్గొన్నారు.

గని మూసివేతకు పూజలు



హోమం నిర్వహిస్తున్న ఏజెంట్ ఏవీ రెడ్డి దంపతులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఆర్కే 5బీ గనిని ఇటీవల మూసివేశారు. ఈ సందర్భంగా బుధవారం శాస్త్రోక్తంగా గనిపై పూజ, హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్ ఏవీ రెడ్డి దంపతులు, ఎస్‌ఓటు జీఎం పురుషోత్తంరెడ్డి, మేనేజర్ అబ్దుల్‌ఖాదీర్, రక్షణాధికారి శివయ్య, సంక్షేమ అధికారి రణదీప్‌గౌడ్, గుర్తింపు సంఘం పిట్ సెక్రెటరీలు నర్సింగరావు, నాయకులు ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎండీని కలిసిన అధికారుల సంఘం నాయకులు



సీఎండీ ఎన్.బలరాంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: ఇటీవల సింగరేణిలో నూతనంగా ఎన్నికైన అధికారుల సంఘం (సీఎంఓఏఐ) నాయకులు కంపెనీ సీఎండీ యన్.బలరాంను మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం హైదరాబాదులోని సింగరేణి భవన్‌లో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నూతన కమిటీని పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నూతన అధ్యక్షుడు లక్ష్మీపతిగౌడ్, జనరల్ సెక్రెటరీ పెద్ది నరసింహులు, ఉపాధ్యక్షులు పీ.శ్రీనివాస్, రాజీవ్‌కుమార్, సహాయ కార్యదర్శులు ఆర్.కిరణ్‌కుమార్, రాజగోపాల్, కోశాధికారి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీట్ అధికారి, వాచర్‌కు ఏడాది జైలు

జన్నారం: మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కలమడుగు అటవీ చెక్‌పోస్టు వద్ద టాటా మాక్స్ ట్రాలీలో వస్తుండగా చెక్‌పోస్టు దండలాగి ఒకరి మృతికి కారణమైన అటవీ బీట్ అధికారి జాడి రాజన్న, వాచర్ కుడుకల రాజేందర్‌లకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ లక్సెట్టిపేట కోర్టు న్యాయమూర్తి మహమ్మద్ అసదుల్లా షరీఫ్ బుధవారం తీర్పునిచ్చారు. ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. దస్తురాబాద్ మండలం గొడిసెర్యాలకు చెందిన ద్యాగెటి వినోద్ 2017 ఆగస్టు 20న జగిత్యాల నుంచి టాటా మాక్స్ ట్రాలీలో వినాయకుడి విగ్రహంతో కలమడుగు మీదుగా గొడిసెర్యాలకు వెళ్తున్నాడు. కలమడుగు అటవీ శాఖ చెక్‌పోస్టు వద్ద జన్నారం నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న కారును ఆపే క్రమంలో తొందరపాటుతో చెక్‌పోస్టు దండ లాగారు. అప్పటికే టాటా మాక్స్ ట్రాలీ చెక్‌పోస్టు దండ సమీపానికి రావడంతో ట్రాలీ వెనుక ఉన్న వినోద్ తల దండకు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనలో మృతుడి తండ్రి ద్యాగెటి లస్మయ్య జన్నారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై రమేష్ కేసు నమోదు చేశారు. సాక్షులను విచారించిన అనంతరం బీట్ అధికారి జాడి రాజన్న, వాచర్ కుడుకల రాజేందర్‌లకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో బుధవారం ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. హ్యాండ్‌బాల్ జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి వంద మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. వీరిలో ఉత్తమ ప్రతిభ చూపిన 16 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. సంజయ్, శ్రావణ్, అనిశ్వర్, సంతోష్, అనిల్‌కుమార్, ప్రదీప్, కార్తీక్, అశ్విన్, కార్తీక్, శ్రీధర్, నవీన్, సాయివర్ధన్, రిషికేష్, మన్విత్ తదితరులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరు ఈ నెల 8 నుంచి 10 వరకు వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. హెచ్‌ఎం కృష్ణారావు, కోచ్‌లు అరవింద్, రాకేశ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.